

చంద్రబాబు పర్యటన ఒక రోజు వాయిదా

- 5న కె.కోటపాడు మండలం చంద్రయ్యపేటలో 'రా కదిలి రా' సభ

అనకాపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన ఒక రోజు వాయిదా పడింది. మాడుగులలో ఫిబ్రవరి నాలుగున నిర్వహించే 'రా కదిలి రా' బహిరంగ సభలో చంద్రబాబు పాల్గొనాల్సి వుండగా, అనివార్య కారణాల వల్ల ఐదో తేదీకి వాయిదా పడిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగజగదీశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా 'రా కదిలి రా' బహిరంగ సభను మాడుగుల బదులు కె.కోటపాడు మండలం చంద్రయ్యపేటలో ఏర్పాటు చేయనన్నట్టు ఆయన పేర్కొన్నారు.

గవరవరంలో ఇసుక దందా

శారదా నదిలో యథేచ్ఛగా తవ్వకాలు

సమీపంలోని తోటలు, ఖాళీ స్థలాల్లో నిల్వ

- రాత్రివేళల్లో ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇతర ప్రాంతాలకు రవాణా
- కొత్త వంతెనకు పొంచి ఉన్న ముప్పు
- వరద ఉధృతితో గట్లకు గండ్లు పడే ప్రమాదం
- పట్టించుకోని రెవెన్యూ, గనుల శాఖల అధికారులు



గవరవరం వద్ద శారదా నది తీరంలో ఇసుక తవ్వకాలు

చోడవరం, జనవరి 31:
ఇసుకాసురులు బరితెగిస్తున్నారు. మండలంలోని గవరవరం వద్ద శారదా నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. గత డిసెంబరులో శారదా నదికి వరద వచ్చినప్పుడు పక్కనే వున్న పేద రైతుల డి.పట్టా భూముల్లో పేరుపోయిన ఇసుక మేటలను సైతం రాత్రిపూట తవ్వుకుపోతున్నారు. అధికార, ప్రతిపక్షం అన్న విభేదాలు లేకుండా స్థానికంగా వున్న నాయకులు ఒక్కటై ఇసుక దందా సాగిస్తున్నారు.

గవరవరం గ్రామానికి సమీపంలో వున్న శారదా నదిలో ఇసుక తవ్వకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతున్నది. శారదా నది గర్భంతోపాటు, గట్లకు ఇరువైపులా ఇసుక తవ్వేస్తున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా నదిలో ఇసుక తవ్వి, టైరు బండ్ల ద్వారా సమీపంలోని ఖాళీ స్థలాలు, తోటల్లోకి చేర్చి కుప్పలుగా పోస్తున్నారు. ఇక్కడి నుంచి రాత్రిపూట ట్రాక్టర్లు, టిప్పర్ లారీల్లోకి లోడింగ్ చేసి జి.జగన్నాథపురం, కె.కోటపాడు మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ ప్రాంతంలోనే గతంలో విచ్చలవిడి ఇసుక తవ్వకాలు జరపడం వల్ల గవరవరం వద్ద భారీ వంతెన కుంగిపోయింది. మళ్లీ వంతెన నిర్మించే వరకు దాదాపు తొమ్మిది సంవత్సరాలపాటు గవరవరం గ్రామస్థులే కాకుండా మూడు మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఎట్టకేలకు కొత్త వంతెన నిర్మాణం పూర్తయి గత ఏడాది ఆగస్టు నుంచి అందుబాటులోకి వచ్చింది. ఇసుకాసురులు మళ్లీ వంతెన సమీపంలోనే అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారు. అయినా సరే రెవెన్యూ, ఇరిగేషన్, గనుల శాఖల అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికార, ప్రతిపక్షాల నేతలు ఒక్కటై ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతుండడంతో సామాన్యులమైన తాము అడ్డుకోలేకపోతున్నామని నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు.



నదికి సమీపంలోని ఖాళీ భూముల్లో నిల్వ చేసిన ఇసుక కుప్పలు

నది గట్లకు, హైస్కూల్‌కు వరద ముప్పు

గవరవరంలో శారదా నది ఒడ్డున జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వుంది. 2012లో నీలం తుపాన్ సంభవించినప్పుడు శారదా నదిలో వరద పోటెత్తింది. దీంతో పాఠశాలకు సమీపంలో నది గట్టు కోతకు గురైంది. వరద ఉధృతి మరికొంచెం పెరిగి వుంటే పాఠశాలను ముంచెత్తేదని గ్రామస్థులు చెబుతున్నారు. అప్పట్లో జిల్లా కలెక్టర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి కోతకు గురైన నది గట్టును మట్టితో కప్పించి ఎత్తుచేయించారు. మళ్లీ ఇప్పుడు అదే గట్టుకు సమీపంలో ఇసుక తవ్వుతున్నారు. నదిలో వరద ప్రవాహం అధికంగా వుంటే గట్టుకు గండిపడితే ఉన్నత పాఠశాలకు ముప్పు వాటిల్లుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు చెప్పినా స్పందన లేదు



శారదా నదిలో మా గ్రామం వద్ద ఇసుక తవ్వకాల వల్ల గతంలో వంతెన కూలిపోయింది. కొత్త వంతెన నిర్మాణంలో తీవ్ర జాప్యం జరగడంతో చాలా ఏళ్లపాటు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఎట్టకేలకు గత ఏడాది వంతెన అందుబాటులోకి వచ్చింది. మళ్లీ వంతెనకు సమీపంలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. దీని వల్ల గట్టు కోతకు గురవడంతోపాటు కొత్త వంతెనకు ముప్పు వాటిల్లుతుంది. ఇసుక అక్రమ తవ్వకాల గురించి అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు.

\- చప్పగడ్డి ముత్యాలనాయుడు, గవరవరం

25 మంది తహసీల్దార్లకు స్థానచలనం

ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు బదిలీ

ఆ జిల్లాల నుంచి అనకాపల్లికి 22 మంది రాక

- ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీలు



అనకాపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల పలు ప్రభుత్వ శాఖల అధికారుల బదిలీల ప్రక్రియ కొనసాగు తున్నది. ఎన్నికల ప్రక్రియతో సంబంధం వున్న అధికారులను జనవరి 31వ తేదీలోగా బదిలీ చేయాలన్న కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న జిల్లా, మండల స్థాయి అధికారులను ఇదే జోన్ లోని ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లా లకు బదిలీ చేస్తున్నారు. ఇప్పటికే పోలీసు శాఖలో సీఐలు, ఎస్‌లకు బదిలీలు జరగ్గా... ఓటర్ల జాబితాల రూపకల్పన నుంచి ఎన్నిక ప్రక్రియ ముగిసే వరకు కీలక భూమిక పోషించే తహసీల్దార్లకు బుధవారం స్థానం చలనం కల్పించారు. ఏడాదిలోపు పదవీ విరమణ కానున్న వారికి బదిలీల నుంచి మిన హాయింపు ఇచ్చారు. అనకాపల్లి జిల్లా నుంచి 25 మంది తహసీల్దార్లను ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు బదిలీ చేశారు. ఆయా రెండు జిల్లాల నుంచి 22 మంది తహసీల్దార్లు అనకాపల్లి జిల్లాకు రానున్నారు.

బదిలీ అయిన తహసీల్దార్లు...

అనకాపల్లి కలెక్టరేట్ 'ఏ' సెక్షన్ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు, 'సి' సెక్షన్ సూపరింటెండెంట్ పి.లక్ష్మీదేవి, భూపరిపాలన విభాగం సూపరింటెండెంట్ ఆర్.నరసింగమూర్తి, ఆర్డీఓ కార్యాలయం పరిపాలన అధికారి సీహెచ్.చంద్రశేఖరరావు, వి.మాడుగుల తహసీల్దారు పీవీరత్నం విజయనగరం జిల్లాకు బదిలీ అయ్యారు. ఇక చోడవరం తహసీల్దారు ఎం.తిరుమల బాబు, దేవరాపల్లి తహసీల్దారు ఎం.లక్ష్మి, ఎలమంచిలి తహసీల్దారు ఎస్.రాణీఅమ్మాజీ, కె.కోటపాడు తహసీల్దారు జె.రమేశ్‌బాబు, కశింకోట తహసీల్దారు జి.సత్యనారాయణ, పరవాడ తహసీల్దారు పి.కనకారావు, రాంబిల్లి తహసీల్దారు పి.భాగ్యవతి, నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయం పరిపాలన అధికారి జె.సూర్యనారాయణ, చీడికాడ తహసీల్దారు బీవీ రాణి, గొలుగొండ తహసీల్దారు వైఎస్‌వీవీ ప్రసాదరావు, కోటవురట్ల తహసీల్దారు కె.జానకమ్మ, మాకవరపాలెం తహసీల్దారు ఎంవీవీప్రసాద్, నక్కపల్లి తహసీల్దారు ఎస్‌వీ అంబేడ్కర్, నాతవరం తహసీల్దారు ఎస్ఎస్ఎస్‌వీఎస్ నాయుడు, నర్సీపట్నం తహసీల్దారు బి.రవికుమార్, ఎస్.రాయవరం తహసీల్దారు కె.విజయకుమార్, పాయరావుపేట తహసీల్దారు కె.జయప్రకాశ్, రావికమతం తహసీల్దారు ఎస్ఏ మహేశ్వరరావు, రోలుగుంట తహసీల్దారు వరహాలు, బుచ్చెయ్యపేట తహసీల్దారు పి.శ్రీనివాసరావు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు.

అనకాపల్లి జిల్లాకు 22 మంది రాక

ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి 22 మంది తహసీల్దార్లు అనకాపల్లి జిల్లాకు బదిలీపై ... మిగతా 8వ పేజీలో

రేంజ్‌లో 14 మంది సీఐల బదిలీ

- వేకెన్సీలో ఉన్న, పదోన్నతి పొందిన వారికి పోస్టింగ్



విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విశాఖ రేంజ్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల పర్వం కొనసాగుతుంది. సీనియర్లతోపాటు తాజాగా సీఐలుగా పదోన్నతి పొందిన అధికారులకు పోస్టింగ్స్ ఇస్తూ రేంజ్ డీఐజీ హరికృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రేంజ్ వేకెన్సీ రిజర్వులో ఉన్న సీఐలు సి.సూర్యనారాయణకు శ్రీకాకుళం జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎక్స్)లో, అడబాల రవికుమార్‌కు విజయనగరం జిల్లా భోగాపురం యూపీఎస్‌లో, ఏవీ లీలా రావుకు విజయనగరం జిల్లా ట్రైనింగ్ సెంటర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఇంకా సాలూరు రూరల్ సీఐ ఎస్.ధనుంజయ రావును అనకాపల్లి రూరల్ స్టేషన్ సీఐగా, పార్వతీపురం మన్యం జిల్లా కొటియా సీఐ బి.రోహిణిపతిని అదే జిల్లాలో స్పెషల్‌బ్రాంచి (ఎక్స్)కు, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సీఐ నమ్మి గణేష్‌ను జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు, విజయనగరం ట్రైనింగ్ సెంటర్‌లో ఉన్న ఎం.చంద్రశేఖర్‌ను విశాఖ రేంజ్‌కు పంపారు. తాజాగా పదోన్నతి పొంది పోస్టింగ్ కోసం రేంజ్‌లో ఎదురుచూస్తున్న గేదెల బాల కృష్ణను పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు రూరల్ సీఐగా, కింతల నారాయణరావును కొటియా సీఐగా, ముదిలి శ్రీనివాసరావును విజయనగరం రూరల్ సీఐగా, డి.దీన బంధును అనకాపల్లి దిశ స్టేషన్ సీఐగా, టి.క్రాంతి కుమార్‌ను అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సీఐగా, ఎస్.సన్యాసినాయుడిని అల్లూరి జిల్లా పాడేరు సీఐగా, బమ్మిడి అప్పలనాయుడును గూడెంకొత్తవీధి సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

వృద్ధురాలికి వలంటీర్లు టోకరా

బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు తస్కరణ

కాపు నేస్తం, కులగణన సర్వే పేరుతో వేలి ముద్ర సేకరణ

- పక్కా ఇల్లు బిల్లు కోసం బ్యాంకుకు వెళ్లిన వృద్ధురాలు
- ఖాతా నుంచి రూ.10 వేలు డ్రా అయినట్టు సిబ్బంది వెల్లడి
- వలంటీర్లే మోసం చేశారని నిర్ధారణ
- పోలీసులకు ఫిర్యాదు
- మరో ఇద్దరితో కలిసి మోసానికి పాల్పడినట్టు అంగీకరించిన వలంటీర్లు



సీఐ అప్పన్నకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు ఎద్దు లక్ష్మి, పక్కన టీడీపీ నేత వజ్రపు శంకరరావు

ఎస్.రాయవరం, జనవరి 31:
గ్రామ వలంటీర్లు కుల గణన సర్వే పేరుతో ఓ వృద్ధురాలి నుంచి వేలిముద్రలు నమోదు చేయించుకుని, ఆమె బ్యాంకు ఖాతా నుంచి పది వేల రూపాయలను కొట్టేసిన సంఘటన ఎస్.రాయవరం మండలం జేవీపాలెంలో చోటుచేసుకుంది. వలంటీర్లు జనవరి 21వ తేదీన మోసానికి పాల్పడగా, ఈ విషయాన్ని ఆమె 30వ తేదీన గుర్తించారు. వలంటీర్ల మోసాన్ని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లి, బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి బాధితులు వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

ఎస్.రాయవరం మండలం జేవీ పాలెం గ్రామానికి చెందిన ఎద్దు లక్ష్మి (60) ఒంటరిగా నివాసం ఉంటున్నారు. గ్రామానికి చెందిన నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్ అనే వలంటీర్లు లక్ష్మి ఈ నెల 21వ తేదీన లక్ష్మి ఇంటికి వెళ్లారు. కాపు నేస్తం, కులగణన సర్వే నిర్వహించడానికి వచ్చామని చెప్పారు. ఆమె నుంచి పలు వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు. అనంతరం ఒక డివైజ్‌లో ఆమె వేలి ముద్రలు నమోదు చేసుకుని వెళ్లిపోయారు. ఇదిలావుండగా కేంద్ర ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన కింద లక్ష్మికి పక్కా ఇల్లు మంజూరైంది. నిర్మాణంలో వున్న ఈ ఇంటికి సంబంధించి బిల్లు మంజూరు కోసం ఆమె 29వ తేదీన హౌసింగ్ ఏఈని కలిశారు. డబ్బులు జమ అయ్యింది, లేనిదీ బ్యాంకుకు వెళ్లి తెలుసుకోవాలని ఏఈ బదులిచ్చారు. లక్ష్మి 30వ తేదీన ఎలమంచిలిలో వున్న ఏపీ గ్రామీణ వికాస బ్యాంకుకు వెళ్లి వాకబు చేశారు. ఈ మధ్య కాలంలో డబ్బులు ఏమీ జమ కాలేదని, అయితే ఈ నెల 21వ తేదీన ఖాతా నుంచి రూ.10 వేలు తీసినట్టు వుందని బ్యాంకు సిబ్బంది చెప్పారు. దీంతో ఆమె మేనేజర్‌ను కలిసి తన ఖాతా నుంచి ఎవరికి డబ్బులు వెళ్లాయో చెప్పాలని కోరారు. మేనేజర్ తనిఖీ చేసి సైతారుపేట గ్రామానికి చెందిన వీసం రామసోమనాయుడు (బ్యాంకు కరస్పాండెంట్) అనే వ్యక్తి ఖాతాకు జమ అయినట్టు చెప్పారు. ఆ రోజు (21వ తేదీ) తన వద్ద వేలి ముద్రలు తీసుకున్న వలంటీర్లపై అనుమానం వచ్చి ఆమె ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ నాయకుడు వజ్రపు శంకరరావుకు చెప్పారు. ఆయన బుధవారం లక్ష్మిని వెంటబెట్టుకుని పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఎంపీడీవో దృష్టికి కూడా తీసుకువెళ్లారు. అనంతరం వలంటీర్లు నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్‌తోపాటు సైతారుపేటకు చెందిన వీసం రామసోమనాయుడు పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావు విచారించగా..బ్యాంకు ... మిగతా 8వ పేజీలో



నెట్ ప్రాక్టీస్‌లో రోహిత్ శర్మ

భారత్, ఇంగ్లండ్ క్రికెటర్ల ముమ్మర సాధన

- రేపటి నుంచి టెస్ట్ మ్యాచ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 31: స్థానిక ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో రెండో తేదీ నుంచి జరగనున్న టెస్ట్ మ్యాచ్‌లో పాల్గొనే భారత్, ఇంగ్లండ్ జట్ల ఆటగాళ్లు బుధవారం ముమ్మర సాధన చేశారు. ఉదయం 9.30 గంటలకు ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్‌తోపాటు తొలి టెస్ట్‌లో భారీ సెంచరీ (196)తో చెలరేగిన పోప్, ఏడు వికెట్లతో భారత్ బ్యాటింగ్‌ను ఘోరంగా దెబ్బతీసిన ఎడమచేతి వాటం స్లో ఆర్థోడాక్స్ బౌలర్ హార్డ్లీ బెయిరిస్టో, ఫోక్స్, లీచ్, క్రాలే, జేమ్స్ అండర్సన్‌లు ప్రధాన స్టేడియం పక్కనున్న 'బి' గ్రౌండ్‌కు చేరుకుని బౌలింగ్, బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో భారత్ కెప్టెన్ రోహిత్‌శర్మతోపాటు బుమ్రా, అశ్విన్, అవేష్ ఖాన్, శ్రీకర్ భరత్, శ్రేయాస్ అయ్యర్, యశస్వి జైశ్వాల్, సర్ఫాజ్ ఖాన్, మహ్మద్ సిరాజ్, కులదీప్ యాదవ్, ముకేష్‌కుమార్, అక్షర పటేల్, సౌరబ్‌కుమార్, శుభమన్ గిల్, వాషింగ్టన్ సుందర్ వంటి ఆటగాళ్లు సాయంత్రం నాలుగు గంటల వరకు ముమ్మర సాధన చేశారు. ప్రాక్టీస్ అనంతరం ఇరుజట్ల ఆటగాళ్లు స్టేడియంను, పిచ్‌ను పరిశీలించారు.

అంగన్‌వాడీల్లో ఆందోళన

హామీలు ఇచ్చారు... జీవోలు మరిచారు

- ప్రధానమైన నాలుగు డిమాండ్లు నెరవేరుస్తామని చర్చల సందర్భంగా ప్రభుత్వ పెద్దల హామీ
- అందులో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించి మాత్రమే జీవో విడుదల
- మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్పు, అర్హులకు సంక్షేమ పథకాల వర్తింపు, వేతనాలను పెంపుపై కానరాని ఉత్తర్వులు
- ఇప్పటివరకూ యూనియన్ నాయకులకు అందని చర్చల మినిట్స్ కాపీ



అనకాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
ప్రభుత్వ పెద్దల హామీ మేరకు సమ్మె విరమించిన అంగన్‌వాడీ సిబ్బంది...రెండు వారాలైనా అందుకు అనుగుణంగా జీవోలు విడుదల కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. డిమాండ్లలో కీలకమైన నాలుగింటిని అమలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. కానీ అందులో ఒక్కదానికి సంబంధించి మాత్రమే ఇప్పటివరకూ జీవో విడుదలైంది. మిగిలిన మూడింటికి సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. ఇక చర్చల్లో భాగంగా డిమాండ్లను నెరవేరుస్తామని ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీకి సంబంధించి మినిట్స్ కాపీని కూడా అసోసియేషన్ నాయకులకు ఇవ్వలేదు. దీంతో అంగన్‌వాడీ సిబ్బందిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

అంగన్‌వాడీ సిబ్బందికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లక్షా రూ.20 వేలు ఇచ్చేందుకు చర్చల్లో ప్రభుత్వ పెద్దలు అంగీకరించారు. అలాగే మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని, అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తామని హామీ ఇచ్చారు. జూలై నుంచి వేతనాలను పెంచుతామని స్పష్టం చేశారు. అయితే, వీటిలో రిటైర్‌మెంట్ బెనిఫిట్‌కు సంబంధించిన జీవో మాత్రమే విడుదల చేశారు. మిగిలిన మూడు అంశాలకు సంబంధించిన జీవోలు విడుదల చేయలేదు. రెండు రోజుల్లోనే జీవోలు విడుదల చేస్తామని చర్చల సందర్భంగా ప్రభుత్వ పెద్దలు హామీ ఇచ్చారు. కానీ, ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. అలాగే, సమ్మె ప్రారంభం నుంచి చర్చల వరకూ పది డిమాండ్లను అమలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు చర్చల్లో జరిగిన ఒప్పందానికి సంబంధించిన మినిట్స్ కాపీని యూనియన్ నాయకులకు అందిస్తామని ప్రభుత్వ ప్రతినిధులు చెప్పారు. ఇప్పటివరకు మినిట్స్ కాపీని అందించలేదు. ప్రతిరోజూ యూనియన్ నాయకులకు ఫోన్లు చేసి అంగన్‌వాడీ సిబ్బంది వీటిపై ప్రశ్నిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో మరోసారి ప్రభుత్వ పెద్దలను కలిసి వీటిపై స్పష్టత తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు భావిస్తున్నారు.

తొందరపాటు నిర్ణయమా?

సమ్మె విరమించిన తరువాత ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో సానుకూల స్పందన రాకపోవడంతో అంగన్‌వాడీ సిబ్బందిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమ్మె విరమణ తొందరపాటు నిర్ణయమని, ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గడం వల్లే జీవోలు విడుదల, మినిట్స్ కాపీ అందించడంలో తాత్సారం చేస్తోందంటూ పలువురు సిబ్బంది అభిప్రాయపడు తున్నారు. ఒకసారి సమ్మె విరమించిన తరువాత చేసేదేమీ ఉండదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు. దీనిపై సంఘ నాయకులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తేనే ఫలితం ఉంటుందని, లేకపోతే తరువాత పట్టించుకునేవారు ఎవరూ ఉండరని అంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి ముందే జీవోలు వచ్చేలా అసోసియేషన్ నాయకులు యత్నించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో అసోసియేషన్ నాయకులు రెండు రోజుల కిందట నగరంలో సమావేశం నిర్వహించారు.

జాగిలాలతో గంజాయి రవాణాకు చెక్

- ఏడాదిపైగా ప్రత్యేక శిక్షణ
- నర్సీపట్నం కేంద్రంగా తనిఖీలకు వినియోగం

నర్సీపట్నం, జనవరి 31:
గంజాయి రవాణాకు చెక్ పెట్టడానికి పోలీసులు శిక్షణ పొందిన జాగిలాలను వినియోగించబోతున్నారు. లేబ్రడార్ రిట్రైవర్ జాతికి చెందిన రెండు (రీటా, బన్నీ) జాగిలాలకు నర్సీపట్నం ఏఎస్పీ కార్యాలయం ఆవరణలోని భవనంలో ప్రత్యేకంగా రెండు గదులు (కెన్నెల్) కేటాయించారు. బుధవారం ఇక్కడకు వచ్చిన జిల్లా ఎస్పీ మురళీకృష్ణ.. ఈ కెన్నెల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలను గుర్తించేందుకు ఈ జాగిలాలకు విజయవాడలో ఏడాదికిపైగా ప్రత్యేక శిక్షణ ఇచ్చారని చెప్పారు. ఏవోబీ నుంచి నర్సీపట్నం మీదుగా ఇతర ప్రాంతాలకు గంజాయి రవాణా అవుతుండడంతో ప్రత్యేక జాగిలాలను ఇక్కడ వుంచినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, అదనపు ఎస్పీలు పి.సత్యనారాయణ, విజయభాస్కర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



జాగిలాలు



పోలీస్ జాగిలాలతో ఎస్పీ మురళీకృష్ణ, ఏఎస్పీ, అదనపు ఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు

ప్రాక్టీస్‌లో క్రికెటర్లు

పీఎంపాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా శుక్రవారం నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగే అంతర్జాతీయ టెస్టు మ్యాచ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఇరు జట్ల క్రీడాకారులు నగరానికి చేరుకున్న విషయం తెలిసిందే. బుధవారం వారంతా మైదానంలో ముమ్మరంగా ప్రాక్టీస్ చేశారు. కొందరు బౌలింగ్, మరికొందరు బ్యాటింగ్, ఫీల్డింగ్ చేస్తూ సందడి చేశారు.


భారత్ ఆటగాళ్ల క్రీడా సాధన


బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తున్న బుమ్రా, అశ్విన్


సాధనలో ఇంగ్లండ్ క్రీడాకారుడు


బౌలింగ్ చేస్తున్న అండర్ సన్


బ్యాటింగ్ చేస్తున్న బెన్ స్ట్రోక్స్


నెట్ ప్రాక్టీస్‌లో రోహిత్ శర్మ

క్రైం... crime news

రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కశింకోట, జనవరి 31: రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని తుని రైల్వే పోలీసు స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. దీనికి సంబంధించి బుధవారం ఆయన తెలిపిన వివరాలివి. తుని రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న బయ్యవరం రైల్వేస్టేషన్ ట్రాక్ వద్ద గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడని ఆయన చెప్పారు. అతనికి సుమారు 45 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. నీలం రంగు టీ షర్టు, బిస్కెట్ రంగు జర్కిన్, సిమెంటు రంగు ఫుల్‌ప్యాంటు ధరించాడని చెప్పారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తుని రైల్వే పోలీసు స్టేషన్‌లో గాని, 9494887786, 9490619020 నంబర్లలో గాని సంప్రతించాలని ఎస్ఐ కోరారు.

యువకుడి ఆత్మహత్య


తేజ (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, జనవరి 31: స్థానిక లక్ష్మీదేవిపేటలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. స్థానిక లక్ష్మీదేవిపేటకు చెందిన కొణతాల తేజ(23) ఐటీఐ చదివి తండ్రి నరసింగరావుకు వ్యవసాయ పనుల్లో తోడుగా ఉంటున్నాడు. కాగా బుధవారం సాయంత్రం వరకు వివిధ పనుల్లో నిమగ్నమైన తేజ సాయంత్రం ఐదు గంటల తరువాత ఇంటికి వచ్చి ఫ్యాన్ హుక్‌కు తాడుతో ఉరివేసుకునేందుకు ప్రయత్నించగా తాడు తెగి కింద పడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులకు అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య

హుకుంపేట, జనవరి 31: మండలంలోని శోభకోట పంచాయతీ కాంగుడువ గ్రామానికి చెందిన గెమ్మెలి లక్ష్మి(30) బుధవారం తన ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. గెమ్మెలి వెంకట్ భార్య అయిన లక్ష్మి ఐదు నెలల క్రితం మతిస్థిమితం కోల్పోయింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం వెంకట్ తమ నివాసానికి సమీపంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి నిర్మాణానికి కొలతలు వేసుకొంటున్నాడు. కొద్దిసేపటి తరువాత లక్ష్మి ఇంటిలోని దూలానికి చున్నీతో వేలాడుతున్నట్టు చూసిన ఇరుగుపొరుగు వారు పెద్దగా కేకలు వేశారు. వెంటనే ఇంటికి వచ్చిన వెంకట్ లోపలికి వెళ్లి ఆమెను కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతిచెందింది. ఈ విషయాన్ని పంచాయతీ సర్పంచ్‌కు తెలియపరిచి, ఆయన ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

చోడవరం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన

» వడ్డాదికి చెందిన ప్రశాంత్ మృతి కేసులో నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న యువకులు, మృతుడి కుటుంబ సభ్యులు

చోడవరం, జనవరి 31: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సమీపంలో మూడు వారాల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన పత్తి ప్రశాంత్‌ది ముమ్మాటికీ హత్యేనని, దీనిపై సమగ్ర విచారణ జరిపించి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ బుచ్చెయ్యపేట, చోడవరం మండలాలకు చెందిన పలువురు యువకులు, ప్రశాంత్ కుటుంబీకులతో కలిసి బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. వడ్డాదికి చెందిన పత్తి ప్రశాంత్ జనవరి 10వ తేదీ రాత్రి స్థానిక డిగ్రీ కళాశాల వెనుక భాగంలో ఉన్న ఓ ఇంటి కిటికీ ఊచలకు ఉరితాడుతో వేలాడుతూ శవమై కనిపించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ప్రశాంత్ ఆత్మహత్య చేసుకోలేదని, ఎవరో హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారంటూ మృతుడి కుటుంబీకులు, వడ్డాదికి చెందిన యువకులు ఆ రోజు ఆందోళన నిర్వహించారు. కాగా ప్రశాంత్ మృతిచెంది 20 రోజులు గడచినా, ఈ కేసులో పోలీసులు ఎలాంటి పురోగతి చూపకపోవడం, తాము అనుమానం వ్యక్తం చేసిన వ్యక్తులను విచారించకుండా కేసును నీరుగారుస్తున్నారని ఆరోపిస్తూ వడ్డాది, చోడవరానికి చెందిన సిరిగిరిశెట్టి శ్రీరాం, దొరపిల్ల, చందు రాంబాబు, ఫుల్లేటి వెంకటేశ్, ఆది హరీశ్, సయ్యపురెడ్డి జనార్దన్ తదితరుల ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ప్రశాంత్ తల్లి పార్వతమ్మ మాట్లాడుతూ, తన కుమారుడిది ముమ్మాటికీ హత్యేనని, ఒక యువతితో ప్రేమ వ్యవహారం ఉందని, ఆమె తండ్రి మరికొందరు కలిసి తన కుమారుడిని హత్య చేశారని ఆరోపించారు. ఆయా వ్యక్తుల పేర్లను పోలీసులకు తెలియపరిచినప్పటికీ వారిని కనీసం స్టేషన్‌కు పిలిపించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, సీఐ శ్రీనివాసరావులు ఆందోళన చేస్తున్న వారితోపాటు ప్రశాంత్ తల్లితో మాట్లాడారు. ఫోరెన్సిక్ నివేదిక ఫిబ్రవరి 23లోగా వస్తుందని, దీనిని పరిశీలించిన అనంతరం అన్ని కోణాల్లో మరింత లోతుగా విచారిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

'ఖాళీ టీచర్ పోస్టులన్నింటినీ డీఎస్సీలో ప్రకటించాలి'

బుచ్చెయ్యపేట, జనవరి 31: రాష్ట్రంలో 50 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా వుండగా 6,100 పోస్టులకే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడానికి కేబినెట్ ఆమోదం తెలపడాన్ని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేకేఎల్ఎన్.ధర్మారావు, ఎస్.దుర్గాప్రసాదరావు ఒక ప్రకటనలో ఖండించారు. డీఎస్సీ ద్వారా నియమితులయ్యే ఉపాధ్యాయులకు రెండు సంవత్సరాలపాటు గౌరవ వేతనం ఇస్తామని తీర్మానం చేయడం దారుణమని అన్నారు. ఎన్నికలు వస్తుండడంతో మొక్కుబడిగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తున్నారని వారు ఆరోపించారు. అన్ని ఖాళీలను డీఎస్సీలో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

టీడీపీ గెలుపు ఖాయం


టీడీపీలో చేరి, పార్టీ కండువాలు కప్పుకున్న వైసీపీ నాయకులతో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

» మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ధీమా

» నాతవరం మండలం శృంగవరం మాజీ సర్పంచ్, పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశంలో చేరిక

నర్సీపట్నం, జనవరి 31: 'మీతో పాటే నేనుంటాను. కలిసి పని చేద్దాం. తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకు వద్దాం. మీరంతా నా కుటుంబ సభ్యులు. టీడీపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందన్న నమ్మకం నాకుంది. వచ్చే ఐదేళ్లు మీకు అండగా ఉంటాను' అని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నారు. బుధవారం నాతవరం మండలం శృంగవరం పంచాయతీకి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కె.అప్పారావు, సుర్ల శ్రీను, కె.అప్పారావుతోపాటు పలువురు కార్యకర్తలు టీడీపీలో చేరారు. అయ్యన్నపాత్రుడు వీరికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో పాలన సాగిస్తున్నదని, తనపై 15 కేసులు పెట్టారని చెప్పారు. 1996లో తాను ఎంపీగా వున్నప్పుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూడా ఎంపీగా వున్నారని, ఢిల్లీలో వున్నప్పుడు ఇద్దరం కలిసి ప్రతి వారం రాజ్యసభ సభ్యుడు సుబ్బిరామిరెడ్డి ఇంట్లో భోజనం చేసేవారమని గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరాలని రాజశేఖర్‌రెడ్డి తనను ఆహ్వానించేవారని, ప్రాణం వున్నంత వరకు టీడీపీని వదిలేది లేదని స్పష్టం చేశానని తెలిపారు. కానీ ఇప్పుడు ఆయన కుమారుడిలో ఈ తరహా లక్షణాలు లేవని అన్నారు. వైసీపీ పాలనతో ప్రజలు విరక్తి చెందారని, ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మాడుగుల ఇన్‌చార్జి పీవీజీ కుమార్, నాతవరం మండల నాయకులు కరక సత్యనారాయణ, లాలం అచ్చిరాజు, నందిపల్లి వెంకటరమణ, సింగంపల్లి సన్యాసిదేవుడు, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి మా భూములు కాపాడండి

» పిసినికాడ, సంపతిపురంలోని బాధితుల వేడుకోలు


రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను చూపుతున్న వారసులు

కొత్తూరు, జనవరి 31: కబ్జాదారుల నుంచి తమ జిరాయితీ భూములను కాపాడాలని అనకాపల్లి మండలం పిసినికాడ, సంపతిపురం పంచాయతీల్లో ఉన్న భూముల బాధితులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక విలేకరులతో అనకాపల్లి పట్టణంలోని రింగురోడ్డు వద్ద ఒక ప్రైవేటు భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారసులు దాడి శ్రీనివాసరావు, దాడి నారాయణస్వామి, బుద్ద బలరాం కృష్ణ, ఆళ్ళ కాశీ అన్నపూర్ణ లలితకుమారి, బుద్ద వీరునాయుడు తదితరులు మాట్లాడుతూ 1949లో తమ తాతలైన బుద్ద అప్పారావునాయుడు, బుద్ద వీరునాయుడు, ఆళ్ళ కాశీవిశ్వనాథం కలిసి కశింకోటకు చెందిన మీర్ హైదర్ సాహెబ్ భార్య కుల్సాను బీబీ సాహెబ్ నుంచి పిసినికాడ, సంపతిపురం పంచాయతీల్లో 84.05 ఎకరాలు జిరాయితీ భూమిని కొనుగోలు చేశారన్నారు. 1985 సంవత్సరంలో తమ పూర్వీకులు మృతి చెందడం, తామంతా చదువుల నిమిత్తం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లడంతో తమ భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. దీనిపై పలుమార్లు కలెక్టర్‌కు, ఆర్డీవో, తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేశామని తెలిపారు. తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పూర్తి స్థాయిలో రీ సర్వే చేసి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

» డీఈవో వెంకట లక్ష్మమ్మ


పదో తరగతి బాలికలతో మాట్లాడుతున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

రావికమతం, జనవరి 31: మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు బాగా రాయాలని, ఉత్తమ ఫలితాలు సాధించి 'ఆణిముత్యాలు' ప్రోత్సాహకానికి అర్హత సాధించేలా కృషి చేయాలని జిల్లా విద్యా శాఖాధికారిణి (డీఈవో) ఎం.వెంకట లక్ష్మమ్మ పదో తరగతి విద్యార్థులకు సూచించారు. ఆమె బుధవారం మండలంలోని కొత్తకోట, పి.పొన్నవోలు పాఠశాలలను సందర్శించారు. తొలుత కొత్తకోట ఉన్నత పాఠశాలలో పదవ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు ఎలా సన్నద్ధం అవుతున్నారు, పాఠాలు అర్థం అయ్యేలా ఉపాధ్యాయులు బోధిస్తున్నారా తదితర అంశాలపై ఆరా తీశారు. పరీక్షలు రాసేటప్పుడు ఆందోళన, ఒత్తిడికి గురికావద్దని సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధిస్తారని దిశానిర్దేశం చేశారు. పదో తరగతిలో 142 మంది విద్యార్థులు వున్నారని హెచ్ఎం నాగేశ్వరరావు చెప్పగా, వీరిలో ఎంతమంది చదువులో వెనుకబడినట్టు గుర్తించారని డీఈవో ప్రశ్నించారు. 22 మందిని గుర్తించామని హెచ్ఎం చెప్పగా, వీరి కోసం రోజూ ఒక గంటపాటు అదనపు సమయం కేటాయించాలని ఆమె సూచించారు. కాగా వచ్చే ఎన్నికలకు ఈ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుండడంతో ఇక్కడి సదుపాయాల గురించి డీఈవో ఆరా తీశారు. తరగతి గదుల్లో కిటికీలు, వెలుతురు పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సదుపాయాలతో పాటు దివ్యాంగులు పోలింగ్ బూత్‌లోకి వెళ్లడానికి ఇబ్బంది లేకుండా ర్యాంప్‌ను సిద్ధం చేయాలని తహసీల్దార్ మహేశ్వరరావుకు సూచించారు.

టెట్, డీఎస్సీ పేరిట జగన్ ఓట్ల రాజకీయం

» నిరుద్యోగులు అన్నీ గమనిస్తున్నారు

» మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ధ్వజం

విశాఖపట్నం, జనవరి 31: మరో రెండు వారాల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న తరుణంలో టెట్, డీఎస్సీ అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఓట్ల రాజకీయానికి తెరలేపారని విద్యా శాఖ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా విమర్శించారు. అది ముమ్మాటికీ ఫేక్ నోటిఫికేషన్ అని, దానిని నిరుద్యోగులెవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎన్నికల సీజన్ కావడంతో ప్రస్తుతం డీఎస్సీ పేరిట షో చేస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా అదిగో, ఇదిగో...అంటూ మాయమాటలు చెప్పారన్నారు. అధికారంలోకి రాగానే 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇస్తామన్న హామీని తుంగలో తొక్కారన్నారు. రాష్ట్రంలో 18,520 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించారని, ఆ తరువాత అసలు ఎక్కడా ఖాళీలు లేవంటూ గందరగోళాన్ని సృష్టించారని విమర్శించారు. గత ఐదేళ్లుగా డీఎస్సీ కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురుచూస్తుంటే ప్రస్తుతం కేవలం 6,100 పోస్టులకు కేబినెట్ ఆమోదముద్ర వేసిందని చెబుతున్నారన్నారు. ఈ ఫేక్ నోటిఫికేషన్ డ్రామాను నిరుద్యోగులు గమనిస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు నిరుద్యోగులంతా సిద్ధంగా ఉన్నారన్నారు. నిరుద్యోగులెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, రానున్నది చంద్రన్న రాజ్యమని, భవిష్యత్తు మనదేనంటూ గంటా భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో మిగిలి ఉన్న పోస్టులన్నీ భర్తీచేసే బాధ్యత చంద్రన్న తీసుకుంటారని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

జోరుగా కోడి పందేలు

» గుల్లాట కూడా..

» వైసీపీ నాయకుల ఒత్తిళ్ల మేరకు పోలీసులు కన్నెత్తి చూడలేదని ప్రచారం


కోడి పందేలు వద్ద గుమిగూడిన జనం


గుల్లాట ఆడుతున్న దృశ్యం

అచ్యుతాపురం, జనవరి 31: సెజ్ పునరావాస కాలనీలో తీర్థం సందర్భంగా బుధవారం కోడి పందేలు, గుల్లాట జోరుగా సాగాయి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రాంతం కోలాహలంగా ఉంది. స్థానిక వైసీపీ నాయకుల ఒత్తిళ్ల మేరకు పోలీసులు కూడా ఇటువైపు రాలేదని తెలిసింది. పోలీసు ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకున్నామని, ఎటువంటి ఇబ్బంది లేదని అధికార పార్టీ నాయకులు భరోసా ఇవ్వడంతో పందేలు యథేచ్ఛగా సాగాయని సమాచారం. ఇందులో లక్షలాది రూపాయలు చేతులు మారాయని తెలిసింది. అచ్యుతాపురం మండలంలో ఇంత బహిరంగంగా కోడి పందేలు, గుల్లాటలు జరగడం ఇదే ప్రథమమని స్థానికులు చర్చించుకుంటున్నారు.

కొనసాగుతున్న సెర్ప్ ఉద్యోగుల సమ్మె

» టీడీపీ, జనసేన నాయకుల సంఘీభావం



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, జనవరి 31: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెర్ప్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. బుధవారం నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద ధర్నా చేయడంతో పాటు నిరసన ప్రదర్శన, నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడి ఆందోళన చేశారు. కాగా దీక్షా శిబిరాన్ని టీడీపీ నాయకులు దాడి రత్నాకర్, ఆడారి కిశోర్‌కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

గంజాయి రవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా

» జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ


గొలుగొండలో నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

గొలుగొండ, జనవరి 31: గంజాయి రవాణాకు అడ్డకట్ట వేయడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. గొలుగొండలో నిర్మించిన పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని ఆయనతోపాటు నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ, ఏవోబీ నుంచి నర్సీపట్నం మీదుగా గంజాయి రవాణా అవుతున్నట్టు పోలీసు శాఖకు వచ్చిన సమాచారం మేరకు ఆయా మార్గాల్లోని చెక్‌పోస్టుల వద్ద తనిఖీలతోపాటు నిరంతరం నిఘా వుండేలా చర్యలు చేపట్టామన్నారు. గొలుగొండ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా వుండాలని సూచించారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, నర్సీపట్నం రూరల్ సీఐ హరి, గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు వున్నారు.

2, 3 తేదీల్లో యూటీఎఫ్ రిలే నిరాహార దీక్షలు

అనకాపల్లి టౌన్, జనవరి 31: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి రెండు, మూడు తేదీల్లో అనకాపల్లి పట్టణంలో యూటీఎఫ్ ఆధ్వర్యం లో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నట్టు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇంకా ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాలుష్య రహిత జిల్లాగా అనకాపల్లి

» కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి


మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 31: అనకాపల్లిని కాలుష్య రహిత జిల్లాగా రూపొందించాలని అధికారులను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా పర్యావరణ ప్రణాళికపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘన, ద్రవ, విద్యుత్ సాంకేతిక వ్యర్థాలతో పాటు ప్రమాదకర వ్యర్థాల నిర్వహణకు తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. నీరు, ధ్వని, కాలుష్యాలను సైతం మోతాదు దాటకుండా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి జీఎం శ్రీధర్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అగ్రి ల్యాబ్‌లో డీఏవో తనిఖీలు


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

మాడుగుల, జనవరి 31: జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) బి.మోహన్‌రావు బుధవారం మాడుగులలోని అగ్రి ల్యాబ్‌ను సందర్శించి తనిఖీ చేశారు. ఇప్పటి వరకు రైతుల నుంచి ఎన్ని నమూనాలు వచ్చాయి? ఎన్నింటిని పరీక్షించారు? తదితర వివరాల గురించి సిబ్బందిని ప్రశ్నించారు. వారు చెప్పిన వివరాలు, రికార్డుల్లో వున్న సమాచారాన్ని పోల్చి చూశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటి వరకు 311 నమూనాలు వచ్చాయని, వీటిల్లో 233 నమూనాల పరీక్షలు పూర్తయ్యాయని, మిగిలినవి పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రైతులు తాము కొనుగోలు చేసిన వరి, అపరాలు, కూరగాయల విత్తనాల నమూనాలను ఇక్కడకు తీసుకువచ్చి మొలక శాతాన్ని, నాణ్యతను, ఇతర సమాచారాన్ని తెలుసుకోవచ్చని చెప్పారు. అంతేకాక వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా గ్రామాల్లోకి వెళ్లి రైతుల నుంచి మట్టి, విత్తనాల నమూనాలను తీసుకొని ల్యాబ్‌లో పరీక్షలు చేయించాలని చెప్పారు.

అనకాపల్లి నియోజకవర్గం

పోలీస్ శాఖలో రిటైర్డు ఉద్యోగులకు సన్మానం



పదవీ విరమణ పొందిన ఎస్ఐకు జ్ఞాపిక అందిస్తున్న ఎస్పీ

అనకాపల్లి రూరల్, జనవరి 31 : జిల్లా పోలీస్ కార్యాలయం పరిధిలో ఇద్దరు పోలీస్ అధికారులు బుధవారం పదవీ విరమణ పొందారు. ఎస్బీ ఎస్ఐగా పనిచేస్తున్న ఆదినారాయణరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న టీవీ రమణమూర్తిలు రిటైర్ కావడంతో వారిని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సన్మానించారు. ఏఎస్పీలు విజయభాస్కర్, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌వోల నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 31 : ఇక్కడి కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వీఆర్‌వోలు ముద్రించిన నూతన సంవత్సర డైరీలను జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆవిష్కరించారు. జేసీ జాహ్నవి, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకాను, అనంతరామయ్య పాల్గొన్నారు.

బోయగూడెంలో మండపం పునః ప్రారంభం

అనకాపల్లి టౌన్, జనవరి 31 : గవరపాలెంలోని బోయగూడెంలో గల ముదిరాజ్ కల్యాణ మండపాన్ని టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ బుధవారం పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము పరమేశ్వరరావు, మైపాలి శ్రీనివాసరావు, మైపాలి నూకరాజు, రవిగణేశ్, త్రినాథ్, పొలిమేర మణి పాల్గొన్నారు.

'ప్రజలపై విద్యుత్ భారాలు రద్దు చేయాలి'

అనకాపల్లి టౌన్, జనవరి 31 : పేదలపై మోపిన వివిధ విద్యుత్ భారాలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. డిస్కమ్‌లు ప్రతిపాదించిన ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బుధవారం ప్రజాభిప్రాయ సేకరణలో ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు.

వృద్ధురాలికి వలంటీర్లు టోకరా

... 5వ పేజీ తరువాయి

బదలాయించినట్టు వలంటీర్లు చెప్పారు. వీరికి వేమగిరికి చెందిన వై.రవి సహకరించినట్టు తెలియడంతో అతనిని కూడా రప్పించి విచారించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు వజ్రపు శంకరరావు మాట్లాడుతూ, వృద్ధురాలిని మోసగించి డబ్బులు తస్కరించిన వలంటీర్లు నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్, వీరికి సహకరించిన వీసం రామసోమనాయుడు, వై.రవిలపై కేసు నమోదు చేయాలని, వలంటీర్లను విధుల నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ఎస్ఐ విభీషణరావును వివరణ కోరగా.. కుల గణన సర్వే కోసం వచ్చిన వలంటీర్లు తన బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు అపహరించినట్టు ఎద్దు లక్ష్మి ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేయలేదని చెప్పారు.

పూర్తి ఆధారాలు ఉంటేనే ఓట్ల తొలగింపు

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 31 : పూర్తి ఆధారాలతోనే ఓట్ల తొలగింపు జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం రాత్రి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఓట్ల తొలగింపు, నమోదు చేసేందుకు తగిన ఆధారాలు ఉండాలన్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు 99 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు చేర్పులు, అభ్యంతరాలు 23,531 రాగా వాటిలో 13,415 ఆమోదించి 1230 దరఖాస్తులు తిరస్కరించినట్టు వివరించారు. ప్రస్తుతం ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి టౌన్, జనవరి 31 : పట్టణంలోని పెరుగు బజార్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా లక్ష్మీనారాయణనగర్, కోట్నివీధి, మళ్లవీధి, గాంధీ బొమ్మ జంక్షన్, చిన్నవీధి, పప్పులవీధి, భీమునిగుమ్మం ప్రాంతాల్లో ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

'రిటైర్డు ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి'

అనకాపల్లి రూరల్, జనవరి 31 : రెండేళ్ల క్రితం ఉపాధ్యాయులు పదవీ విరమణ అనంతరం తమ జీతాల నుంచి ప్రభుత్వం వద్ద దాచుకున్న డబ్బును వెంటనే మంజూరు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ కోరారు. ఈ మేరకు కొప్పాకలోని జిల్లా విద్యాశాఖాధికారిణి కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వం, విద్యాశాఖా మంత్రి విడతల వారీగా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లిస్తామని చెప్పినప్పటికీ ఆ హామీలు అమలు కాలేదని వాపోయారు.

జగనన్న కాలనీలో ఆర్‌సీ ప్లాట్లు పరిశీలించిన రెవెన్యూ బృందం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సబ్బవరం, జనవరి 31 : పైడివాడఅగ్రహారంలో బుధవారం రెవెన్యూ అధికారులు పర్యటించారు. 'డి.పట్టా రైతులకు మొండి చెయ్యి' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో తాజాగా ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. పేద లందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్ల స్థలాలు ఇచ్చిన రైతులకు పరిహారం కింద కేటాయించిన రీ కానిస్టిట్యూట్ (ఆర్‌సీ) ప్లాట్లను ఆర్ఐ వీరయ్య, సర్వేయర్ కర్రి వెంకటరమణ, వీఆర్వో వెంకటేశ్ పరిశీలించారు. లంకెలపాలెం రోడ్డు నుంచి నలభై అడుగులు రోడ్డు వేసేందుకు వీఎంఆర్‌డీఏకు ప్రతి పాదనలు పంపిస్తామన్నారు. అదే విధంగా శ్మశాన వాటికకు ఎకరం స్థలం కేటాయిస్తామని, తుమ్మల చెరువు నుంచి మిగులు నీరు కిందికి పోయేందుకు సీసీ కాలువ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు ఇచ్చిన ఆర్‌సీ ప్లాట్లపైకి వరద నీరు రాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఘనంగా అభయాంజనేయ తీర్థం

సబ్బవరం, జనవరి 31 : ఆరిపాక శివారు పెదయాతపాలెంలో అభయాంజనేయ తీర్థాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు జరిపారు. వైస్ ఎంపీపీ ఝాన్సీలక్ష్మీరాణి, శరగడం రాము, శరగడం అప్పలనాయుడు, కాళ్ల చంద్రరావు, నర్సమ్మ, సూరిఅప్పారావు, కోటేశ్వరరావు, తేజ, శ్రీనివాసరావు, వెంకీ, శివ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ

కశింకోట, జనవరి 31 : గొబ్బూరు, తాళ్లపాలెం, అచ్చెర్ల, మోసయ్యపేట గ్రామాల్లో పాల ఉత్పత్తిదారుల సంఘంలోని పాడి రైతులకు విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు చేతులమీదుగా బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడిరైతుల సంక్షేమానికి డెయిరీ పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. యలమంచిలి యూనిట్ మేనేజర్ శ్రీనివారావు, సూపర్‌వైజర్ సత్యనారాయణ, పప్పల అప్పారావు, గుమ్మిడి నారాయణరావు, రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

'వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టండి'

పరవాడ, జనవరి 31 : వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత బూత్ ఇన్‌చార్జిలపై ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన బూత్ ఇన్‌చార్జిల శిక్షణ శిబిరంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ప్రతి ఒక్కరూ వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. అలాగే టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలను తెలియజెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే అందరి లక్ష్యం కావాలన్నారు. పీలా శ్రీనివాసరావు, షేక్ రీయాజ్ శిక్షకులుగా వ్యవహరించారు. మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, నాయకులు అట్టా సన్యాసి అప్పారావు, బొండా తాతారావు, గొంప మారునాయుడు, పైలా బుజ్జి, పోతల నూకరత్నం, వర్రి చంద్రశేఖర్, పైలా శ్రీరామ్మూర్తి, కన్నూరు సంధ్య, పైలా వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన బూత్ కమిటీ ఇన్‌చార్జిలతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు

తహసీల్దార్లకు స్థానచలనం

... 5వ పేజీ తరువాయి

రానున్నారు. శ్రీకాకుళం కలెక్టరేట్ నుంచి బి.రాజేశ్వరరావు. బి.ప్రకాశరావు, డి.రామ్మూర్తి, టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి జి.ప్రభాకరరావు, బి.వెంకటరమణ (స్పెషల్ తహసీల్దారు, కొవ్వాడ), ఎస్.రమేశ్‌కుమార్, ఎస్.గణపతిరావు (ఆమదాలవలస), జి.లక్ష్మీనారాయణ (సరుబుజ్జిలి), ఎస్.రమణారావు (బూర్జ), కె.శ్రీరాములు (పోలాకి), టి.సత్యనారాయణ (ఎచ్చెర్ల), పి.వేణుగోపాలరావు (జి.సిగడాం), జె.ఈశ్వరమ్మ (కోటబొమ్మాళి), జె.చలమయ్య (సంతబొమ్మాళి), కె.రవిచంద్ర (పాతపట్నం), బి.మురళీమోహన్‌రావు (హిరమండలం), ఎం.శ్రీకాంత్ (కొత్తూరు), ఆర్.అప్పలరావు (ఎల్ఎన్ పేట), పి.సరోజిని (మెళియాపుట్టి), ఎల్.మధుసూదనరావు(పలాస), బి.పాపారావు (మందస), బి.అప్పలస్వామి (వజ్రపుకొత్తూరు), విజయనగరం జిల్లా విజయనగరం తహసీల్దారు కె.శ్రీనివాసరావులను అనకాపల్లి జిల్లాకు కేటాయించారు.

పెందుర్తి నియోజకవర్గం

పోలీస్ శాఖకు 'లారస్' వాహనం వితరణ



ఎస్పీకి వాహన తాళం అందజేస్తున్న లారస్ ప్రతినిధి

పరవాడ, జనవరి 31 : లారస్ ల్యాబ్స్ ఫార్మా యాజమాన్యం సీఎస్ఆర్‌లో భాగంగా జిల్లా పోలీస్ శాఖకు బొలేరో వాహనాన్ని సమకూర్చింది. ఈ మేరకు బుధవారం ఇక్కడ లారస్ ల్యాబ్స్ హెచ్ఆర్ విభాగం ప్రెసిడెంట్ సీహెచ్.నరసింహారావు చేతుల మీదుగా జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ వాహన తాళాలను అందజేశారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ విభాగం డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐ బాల సూర్యారావు, ఎస్ఐలు సురేష్, మల్లేశ్వరరావు, వెంకటరావు, రామకృష్ణారావు, సతీష్ పాల్గొన్నారు.

హోరాహోరీగా గుర్రపు పరుగు పందాలు

కశింకోట, జనవరి 31 : మండలంలోని ఏఎస్‌పేట, నరసాపురం, గొబ్బూరు గ్రామాల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి తీర్థాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన జిల్లాస్థాయి గుర్రపు పరుగు పందాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత వైఎస్ విగ్రహానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్, వైసీపీ మండల శాఖ అధ్యక్షుడు మలసాల కిషోర్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

గ్రామాల్లో సమస్యలపై ఘోష

- పరిష్కారానికి పరవాడ మండల సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వేడుకోలు

పరవాడ, జనవరి 31 : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు వేడుకున్నారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన బుధవారం పరవాడ మండల సర్వసభ్య సమావేశం ఇక్కడ ఏర్పాటైంది. పలువురు సభ్యులు మండలంలో అపరిష్కృతసమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. పరవాడ, రావాడ సర్పంచ్‌లు సిరపురపు అప్పలనాయుడు, మోటూరి సన్యాసినాయుడు మాట్లాడుతూ ఊటగెడ్డ జంక్షన్ నుంచి సినిమాహాల్ జంక్షన్ వరకు, అలాగే పరవాడ సంతబయలు నుంచి సినిమాహాల్ జంక్షన్ వరకు, ఊటగెడ్డ జంక్షన్ నుంచి ఎన్టీపీసీ వరకు రహదారులు అధ్వానంగా ఉన్నాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. హిందూజా పవర్ ప్లాంట్‌కు బొగ్గులోడుతో రాకపోకలు సాగిస్తున్న లారీలు కారణంగా పరవాడ ప్రాంతంలో రహదారులు దెబ్బతింటున్నాయని వాటి మరమ్మతులకు హిందూజా పరిశ్రమ నుంచి సీఎస్ఆర్ నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని పరవాడ ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, సర్పంచ్ కోరారు. రావాడ వీఆర్‌ఏ గత మూడేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని ఇదే విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆ పంచాయతీ సర్పంచ్ సభలో ప్రస్తావించారు. జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పరవాడ సర్పంచ్ కోరారు. వాడ చీపురుపల్లిలో గత ఆరు నెలలుగా ఆర్‌వో ప్లాంట్ పనిచేయడం లేదని తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని వైస్ ఎంపీపీ బూసి అప్పలరాజు కోరారు. అనంతరం మండల వ్యవసాయాధికారిణి చంద్రావతి, వాడచీపురుపల్లి పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ పార్వతి , ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారిలతో పాటు పలువురు అధికారులు ఆయా శాఖల పరంగా చేపట్టిన, చేపట్టనున్న పనులను వివరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజుతో పాటు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి

ఎలమంచిలి నియోజకవర్గం

నేడు తీర్థ మహోత్సవం

ఎలమంచిలి, జనవరి 31: పట్టణంలోని పెండిపోలం సమీపంలో తులసీఘాట్ వద్ద విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు జ్ఞాపకార్థం గురువారం తీర్థ మహోత్సం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో తులసీరావు కాంస్య విగ్రహావిష్కరణ చేయనున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అలాగే ఎడ్ల పరుగు పోటీలను నిర్వహించేందుకు మైదానం సిద్ధం చేశారు.

ఎస్ఐగా ప్రసాదరావు బాధ్యతలు



మునగపాక, జనవరి 31: ఎస్ఐగా పి.ప్రసాదరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన మహమ్మద్ అలీ అనకాపల్లి పట్టణ పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. అతని స్థానంలో ఎస్.రాయవరంలో చేస్తున్న ఎస్ఐ ప్రసాదరావు బాధ్య తలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐను పలు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు కలసి అభినందనలు తెలిపారు.

35 మందికి కంటి ఆపరేషన్లు

అచ్యుతపురం, జనవరి 31: మండలంలో 35 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి తెలిపారు. ఈ నెల 28న జరిగిన కంటి వైద్య శిబిరంలో వైద్య నిపుణులు 35 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారన్నారు. వారికి విశాఖలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించి బుధవారం ప్రత్యేక వాహనంపై స్వగృహాలకు చేర్చామని ఆయన చెప్పారు.

వైసీపీ పాలనలో చేతి వృత్తులకు అన్యాయం

- తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు అనిత

నక్కపల్లి, జనవరి 31: వైసీపీ పాలనలో చేతి వృత్తుల వారికి తీవ్ర అన్యాయం జరిగిందని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. అనితను ఆమె నివాసం వద్ద నియోజకవర్గం శెట్టి బలిజ ప్రతినిధులు, కల్లుగీత కార్మిక సొసైటీ ప్రతినిధులతో బుధవారం కలిసి సమస్యలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మూడు నెలల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని, అప్పుడు ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘ ప్రతినిధులు పిల్లి రాంబాబు, దమ్ము అప్పారావు, కట్టా అప్పలకొండ, బత్తిన సత్యనారాయణ, పి.సూర్యనారాయణ, బత్తిన జగ్గారావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అనిత ఆర్థిక సాయం

రాజయ్యపేటలో ఇటీవల సెప్టిక్ ట్యాంక్ ప్రమాదంలో రంగాల జగదీశ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న అనిత, అతని కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. గర్భవతిగా ఉన్న జగదీశ్ భార్యకు రూ.10 వేలు అందించారు. కుటుంబానికి టీడీపీ అండగా వుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు పిక్కి సత్తియ్య, పిక్కి గంగరాజు, పిక్కి కోదండరావు, మడదా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.





కోటవురట్ల: రాజుపేట సభలో మాట్లాడుతున్న అనిత.. (ఇన్‌సెట్‌లో) రాజయ్యపేట బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న అనిత

వైసీపీ ఓటమి ఖాయం

కోటవురట్ల: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి భారీ ఓటమి తప్పదని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత పేర్కొన్నారు. మండలంలోని రాజుపేటలో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో దోచుకున్న సొమ్ముతో సిద్ధమంటూ సీఎం జగన్ ప్రచార సభలు నిర్వహిస్తున్నారన్నారు. బీసీల ద్రోహి సీఎం జగన్ అని, బీసీలకు పెద్దపీట వేసింది మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు అని పేర్కొన్నారు. రెండు నెలల్లో సైకో సీఎంను ఇంటికి సాగనంపాలని చెప్పారు. సీఎం జగన్ బీసీలపై అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టి వేధించి, వారికి ద్రోహిగా మారారన్నారు. టీడీపీ పాలనలోనే బీసీలకు అధిక ప్రాధాన్యం దక్కిందన్నారు. నిత్యావసర సరకుల ధరలను విపరీతంగా పెంచేసి పేదల నడ్డీ విరిచిన ఘనత జగన్‌దేనన్నారు. టీడీపీని అధికారంలోకి తీసుకురావడానికి బీసీలు సైనికుల్లా పనిచేయాలన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సమావేశంలో రాజుపేట సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ, జనసేన మండల అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, నాయకులు వేచలపు జనార్దన్, బాస్కరరావు, పెట్ల లింగంనాయుడు, జీరెడ్డి నానిబాబు, సుంకర్ బాబ్జి పాల్గొన్నారు.

పేదల సొమ్ము దోచుకోవడం దారుణం : అనిత

ఎస్.రాయవరం, జనవరి 31: సర్వేల పేరుతో వేలి ముద్రల ద్వారా వలంటీర్లు పేదల సొమ్ము దోచుకోవడం దారుణమని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. జేవీ పాలెం, సారిపల్లిపాలెంలోని బాధితులు బుధవారం అనిత స్వగృహానికి వెళ్లి తమ సమస్యలను వివరించారు. దీనిపై అనిత స్పందిస్తూ పేదలు బ్యాంకుల్లో దాచుకున్న డబ్బును వలంటీర్లు సర్వేల పేరుతో దోచుకుంటున్నారని మండిపడ్డారు. వేసీపీ దొంగలను తరిమికొట్టే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కండి

- జనసేన/టీడీపీ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా పనిచేయాలి
- జనసేన ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి విజయకుమార్

రాంబిల్లి/అచ్యుతాపురం, జనవరి 31: సార్వత్రిక ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని జనసేన ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. హరిపురంలోని పార్టీ కార్యాలయంలో అచ్యుతాపురం నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నెలలు గ్రామాల్లోనే ఉంటూ జగన్‌రెడ్డి ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై ప్రచారం చేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు దోచుకోవటం, దాచుకోవటం తప్ప నియోజక వర్గ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. జనసేన/టీడీపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఉమ్మడి ప్రభుత్వం రాగానే సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చక్కగా అమలు చేయనున్నట్టు చెప్పారు. సమావేశంలో జడ్‌పీటీసీ మాజీ సభ్యుడు జె.శ్రీనివాసరావు, పార్టీ అచ్యుతాపురం మండల అధ్యక్షుడు బి.శ్రీరామదాసు, విశాఖ రూరల్ జిల్లా కార్యదర్శులు ఎం.శ్రీవేణి, రేఖ అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కొక్కిరగెడ్డ పవన్ విజయ్, నాయకులు పప్పల రమణ, మేరుగు ప్రవీణ్ కుమార్, సీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

'రైతుల బాధలు అధికారులు, పాలకులకు పట్టవా?'

రాంబిల్లి, జనవరి 31: పెదకలవలాపల్లి రైతుల బాధలు అధికారులు, పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీనువాసరావు ప్రశ్నించారు. బుధవారం పార్టీ నేతలతో కలిసి బాధిత రైతుల రిలే దీక్షల శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాలకు వెళ్లకుండా గ్రామంలోని కొండ చుట్టూ నేవీవారు ప్రహారీ గోడ నిర్మించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జగతా శ్రీనివాస్, టి.అనంతరావు, రాహుల్, సిహెచ్.సుభద్రరావు, మారుతి చక్రవరి తదితరులు పాల్గొన్నారు.

బయ్యవరంలో ద్విచక్ర వాహనం దగ్ధం

ఎలమంచిలి, ఫిబ్రవరి 31: పేట బయ్యవరం గ్రామ శివారులో పొలాల వద్ద మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పాడి పాకతో పాటు ఇంటి సామగ్రి, ద్విచక్ర వాహనం దగ్ధమయ్యాయి. దీంతో సుమారు 80 వేల రూపాయలు వరకూ నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

మండల సమావేశంలో సమస్యలపై నిలదీత

పాయకరావుపేట, జనవరి 31: మండలంలోని సమస్యలపై పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు అధికారులను నిలదీశారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఎంపీపీ ఇసరపు పార్వతి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు కాకపోవడం, తాగునీటి సమస్యల అధికం కావడంపై సభ్యులు మండిపడ్డారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదని వాపోయారు. అనంతరం మత్స్యశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు మాట్లాడుతున్న సమయంలో శ్రీరాంపురం సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ అభ్యంతరం తెలుపుతూ పంచాయతీ పరిధిలో సుమారు 300 ఎకరాల్లో ఉన్న ఆరు చెరువులకు సంబంధించి ఉన్న ఫిషర్‌మెన్ సొసైటీతోపాటు మెరైన్ ఫిషర్‌మెన్ సొసైటీలకు నిబంధనల ప్రకారం ఉండాల్సిన సభ్యులు లేకపోయినా మత్స్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సర్వే నం.17/1లోని ప్రభుత్వ భూమిలో అధికారులు ఏర్పాటుచేసిన బోర్డును తొలగించిన విషయమై పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జడ్పీటీసీ సభ్యులు లంక సూరిబాబు మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు తెలియజేసిన సమస్యలు సత్వర పరిష్కారమయ్యేలా అధికారులు కృషిచేయాలన్నారు. అలాగే గ్రామాల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్, మండల పరిషత్ కార్యాలయ ఏవో వర్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు అభివృద్ధికి సంతకాల సేకరణ

అచ్యుతాపురం/మునగపాక, జనవరి 31: శిథిలమైన అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు అభివృద్ధి కోసం సీపీఎం నాయకులు బుధవారం సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ వందలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డు గురించి అధికారులు, పాలకులు పట్టించుకోవటంలేదన్నారు. రోడ్డు గోతులమయమై నందున వాహన చోదకులతో పాటు ప్రయాణికులు విద్యార్థులు, వృద్ధులు, గర్భిణులు, రోగులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ రోడ్డు దుస్థితిపై పలుమార్లు స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఈ రోడ్డును వెంటనే పునర్నిర్మించాలని సంతకాలు సేకరణ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రొంగలి రాము, కర్రి అప్పారావు, కె.రామసదాశివరావు, కె.సోమునాయుడు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని డ్రైవర్లపై చర్యలు తప్పవు

ఎలమంచిలి, జనవరి 31: ట్రాఫిక్ నిబంధనలు పాటించని డ్రైవర్లపై చర్యలు తప్పవని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. పట్టణంలోని ప్రైవేటు స్కూలు ఆవరణలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా విద్యార్థులను పాఠశాలలకు తరలించే డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.

పాయకరావుపేట నియోజకవర్గం

గురువే పిల్లలకు దైవం: డీఈవో

నక్కపల్లి, జనవరి 31: గురువే పిల్లలకు దైవమని జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ అన్నారు. బంగారమ్మపేట పాఠశాల హెచ్ఎం నల్లల చలపతిరావు పదవీ విరమణ సందర్భంగా బుధవారం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేసే ఉపాధ్యాయులకు పదవీ విరమణ తర్వాత కూడా గుర్తింపు వుంటుందన్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా చలపతిరావు సేవలు ప్రశంసనీయమన్నారు. చలపతిరావు మాస్టారు దంపతులను పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సత్కరించారు.

నక్కపల్లి సీఐగా విజయ్‌కుమార్



నక్కపల్లి, జనవరి 31: నక్కపల్లి పోలీస్ స్టేషన్ సీఐగా అంబటి విజయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. కొత్తగా నక్కపల్లి మండలాన్ని సర్కిల్‌గా ఏర్పాటు చేయడం సీఐ విజయ్‌కుమార్ బుధవారం ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు.

ఎస్ఐగా విభీషణరావు బాధ్యతల స్వీకారం



ఎస్.రాయవరం, జనవరి 31: ఎస్ఐగా అట్టాడ విభీషణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకూ ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన ప్రసాదరావు మునగపాక బదిలీ చేశారు. అతని స్థానంలో విభీషణరావు బదిలీపై వచ్చారు.

కారిడార్ రైతుల సమస్యలు పరిష్కరించండి

నక్కపల్లి, జనవరి 31: మండలంలో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములు ఇచ్చిన రైతుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, రైతు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఫిబ్రవరి 2న సీఎం జగన్ అమరావతి నుంచి వర్చువల్ విధానంతో పలు పరిశ్రమలకు శంకుస్థాపనలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించి, భూములిచ్చిన వారికి పూర్తి ప్యాకేజీ ఇచ్చిన తరువాతే శంకుస్థాపన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.రాజేశ్, మహేశ్, శ్రీరాములు, ఎం.బాపూజీ, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి సర్వే రికార్డుల తనిఖీ

పాయకరావుపేట, జనవరి 31: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ఇటీవల నిర్వహించిన కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమ సర్వే రికార్డులను జాతీయ కుష్టువ్యాధి నివారణ కార్యక్రమం జాయింట్ డైరెక్టర్ దేవసాగర్ తనిఖీ చేశారు. బుధవారం పీహెచ్‌సీకి వచ్చిన ఆయన డిసెంబరు 26 నుంచి జనవరి 13వ తేదీ వరకు పీహెచ్‌సీ పరిధి గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి కుష్టువ్యాధి నివారణ కార్యక్రమ సర్వే రికార్డులను తనిఖీచేసి వైద్యాధికారులు సుభాష్, సౌజన్య, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ బాలాజీ ఉన్నారు.

ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయరూ..

నక్కపల్లి, జనవరి 31: స్థానిక 50 పడకల ఆస్పత్రిలో ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. బుధవారం ఆస్పత్రి వద్ద సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అప్పలరాజు ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. నాయకులు ఎం.రాజేశ్, ఎం.మహేశ్‌బాబు, బి.రాము, జి.రమణ, ఎం.బాపూజీ, ఎ.అప్పలరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి

▸ టీడీపీ నాయకుల సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్



టీడీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న పీవీజీ కుమార్

మాడుగుల, జనవరి 31 : నియోజకవర్గంలోని కె.కోటపాడు మండలం చంద్రయ్యపేటలో ఈనెల ఐదో తేదీ సోమవారం టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించనున్న రా.. కదలిరా.. బహిరంగ సభను ప్రజలంతా విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సభపై మాడుగుల, కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ మండలాల్లో పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజా వ్యతిరేక విధనాలపై కూడా గ్రామాల్లో వివరించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అద్దెపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, నాయకులు పుప్పాల అప్పలరాజు, లెక్కల కాశిబాబు, రమేష్, జనసేన పార్టీ నాయకుడు రొబ్బా మహేష్, దర్శిశెట్టి అప్పలనాయుడులతో పాటు ఇరు పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

శృంగవరంలో టీడీపీ శ్రేణుల కోలాహలం

▸ వైసీపీకి చెందిన మాజీ సర్పంచ్ అప్పారావు సహా పలువురు పార్టీలో చేరిక
▸ ముందుగా అయ్యన్న ఇంటికి వెళ్లేందుకు వీధుల్లో బాణ సంచాతో ర్యాలీ



కొంగ్రు అప్పారావు, సుర్ల శ్రీను తదితరులతో కలిసి టీడీపీ శ్రేణుల ర్యాలీ

నాతవరం, జనవరి 31 : మండలంలోని శృంగవరంలో బుధవారం సందడి వాతావరణం నెలకొంది. ఈ గ్రామ మాజీ సర్పంచ్, వైసీపీ నాయకులు కొంగ్రు అప్పారావు, సుర్ల శ్రీను తదితరులు స్థానిక టీడీపీ సీనియర్ నాయకుడు ఉలబాల అప్పలనాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకోవడానికి భారీ ర్యాలీగా నర్సీపట్నంలోని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఇంటికి తరలి వెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ తదితరులు ముందుగా శృంగవరం వెళ్లారు. దీంతో కేడర్ మరింత ఉత్సాహంగా బాణ సంచాకాల్చి సంబరాలు చేసుకుంటూ వీధి వీధినా ర్యాలీగా ముందుకు సాగారు. ఈ సందర్భంగా కరక సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల్లో మార్పు వస్తుందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో విలుగు చెందిన ఆ పార్టీ ముఖ్య నాయకులు సైతం టీడీపీలోకి వస్తుండడం శుభపరిణామంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలం అచ్చిరాజు, మాజీ ఎంపీపీ సింగంపల్లి సన్యాసిదేముడు, తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ కొండబాబు, ఉలబాల బాపిరాజు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్ పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

▸ సిబ్బందికి అడిషినల్ ఎస్పీ విజయభాస్కర్ ఆదేశం

కృష్ణాదేవిపేట, జనవరి 31 : త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నగదు, మద్యం తదితరాలు అక్రమ రవాణా జరగకుండా చెక్ పోస్టుల వద్ద పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు ఎస్పీ విజయభాస్కర్ ఆదేశించారు. బుధవారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భీమవరం చెక్ పోస్టు వద్దనున్న కంటెయినర్‌ను ఎన్నికలు అయ్యే వరకు ఇక్కడ ఏర్పాటు చేసుకోవాలని కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్రకు సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు జిల్లాలోని పలుచోట్ల పోలీస్ చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సిబ్బందిని కూడా అప్రమత్తం చేస్తున్నామన్నారు.

వృద్ధురాలికి వలంటీర్లు టోకరా

... 5వ పేజీ తరువాయి

బదలాయించినట్టు వలంటీర్లు చెప్పారు. వీరికి వేమగిరి గ్రామానికి చెందిన వై.రవి సహకరించినట్టు తెలియడంతో అతనిని కూడా రప్పించి విచారించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు వజ్రపు శంకరరావు మాట్లాడుతూ, వృద్ధురాలిని మోసగించి డబ్బులు తస్కరించిన వలంటీర్లు నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్, వీరికి సహకరించిన వీసం రామసోమనాయుడు, వై.రవిలపై కేసు నమోదు చేయాలని, వలంటీర్లను విధుల నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ఎస్ఐ విభీషణరావును వివరణ కోరగా.. కుల గణణ సర్వే కోసం వచ్చిన వలంటీర్లు తన బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు అపహరించినట్టు ఎద్దు లక్ష్మి ఫిర్యాదు చేశారని, ఇంకా కేసు నమోదు చేయలేదని బదులిచ్చారు.

25 మంది తహసీల్దార్లకు స్థానచలనం

... 5వ పేజీ తరువాయి

రానున్నారు. శ్రీకాకుళం కలెక్టరేట్ నుంచి బి.రాజేశ్వరరావు. బి.ప్రకాశరావు, డి.రామ్మూర్తి, టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి జి.ప్రభాకరరావు, బి.వెంకటరమణ (స్పెషల్ తహసీల్దారు, కొవ్వాడ), ఎస్.రమేశ్‌కుమార్, ఎస్.గణపతిరావు (ఆమదాలవలస), జి.లక్ష్మీనారాయణ (సరుబుజ్జిలి), ఎస్.రమణారావు (బూర్జ), కె.శ్రీరాములు (పోలాకి), టి.సత్యనారాయణ (ఎచ్చెర్ల), పి.వేణుగోపాలరావు (జి.సిగడాం), జె.ఈశ్వరమ్మ (కోటబొమ్మాళి), జె.చలమయ్య (సంతబొమ్మాళి), కె.రవిచంద్ర (పాతపట్నం), బి.మురళీమోహన్‌రావు (హిరమండలం), ఎం.శ్రీకాంత్ (కొత్తూరు), ఆర్.అప్పలరావు (ఎల్ఎన్ పేట), పి.సరోజిని (మెళియాపుట్టి), ఎల్.మధుసూదనరావు(పలాస), బి.పాపారావు (మందస), బి.అప్పలస్వామి (వజ్రపుకొత్తూరు), విజయనగరం జిల్లా విజయనగరం తహసీల్దారు కె.శ్రీనివాసరావులను అనకాపల్లి జిల్లాకు కేటాయించారు.

ప్రధాన రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం

▸ రావికమతం- కింతలి ఆర్‌అండ్‌బీ రోడ్డులో రెండు చోట్ల మదుంలకు రంధ్రాలు ▸ రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
▸ రాత్రివేళ తరచూ చిన్నచిన్న ప్రమాదాలు ▸ పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు ▸ వెంటనే స్పందించాలని పలువురు వేడుకోలు



గుమ్మాళ్లపాడు పారమ్మ చెరువు వద్ద దుస్థితి



కింతలి రోడ్డు మధ్యలో శ్మశాన చెరువు వద్ద మదుంపై పడిన రంధ్రం

రావికమతం, జనవరి 31 : ప్రధాన రహదారులు పలుచోట్ల ప్రమాదకరంగా మారుతున్నాయి. నిర్మాణాల సమయాల్లో కొందరు కాంట్రాక్టర్లు నిబంధనలకు నీళ్లొదలడం, పలు క్వారీల నుంచి పరిమితికి మించి భారీ లోడుతో వాహనాలు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తుండడం వల్ల పలుచోట్ల అస్తవ్యస్తంగా మారుతున్నాయి. కొన్నిచోట్ల వంతెనలు ఉన్న చోట రంధ్రాలు సైతం పడుతున్నాయి. ఫలితంగా ఇటువంటి రోడ్లపై రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే పరిస్థితి ఈ మండలంలో పలుచోట్ల కనిపిస్తోంది. రావికమతం- కింతలి ఆర్‌అండ్‌బీ రహదారిలోని మరి డమ్మ గుడి దాటాక శ్మశాన చెరువు వద్ద, గుమ్మాళ్లపాడు గ్రామ సమీపంలో పారమ్మ చెరువు వద్ద ఉన్న మదుంలకు రెండు చోట్ల రంధ్రాలు పడ్డాయి.

పారమ్మ చెరువులోకి కొండగెడ్డ నుంచి వచ్చే నీటి కోసం, అలాగే అద్దెపల్లి గెడ్డ పొలాల నీరు శ్మశాన చెరువులోకి పోయే విధంగా ఆర్‌అండ్‌బీ రోడ్డులో 1980లో ఈ నిర్మాణాలు చేపట్టారని స్థానికులు చెపుతున్నారు. పారమ్మ చెరువు వద్ద గతంలోనే రంధ్రం పడగా, శ్మశాన చెరువు వద్ద తాజాగా మదుంకు రంధ్రం పడిందని అంటున్నారు. దీంతో వాహనదారులు ఇక్కడ ప్రమాదాలకు గురికాకుండా రంధ్రంలో అటుగా రాకపోకలు సాగించేవారు చిన్నపాటి కర్రను పాతి దానికి ఎరుపు రంగు గుడ్డను తగిలించారు. అయితే రంధ్రం పడి వారం పది రోజులవుతున్నా ఆర్‌డ్‌బీ అధికారులు పట్టించుకోలేదు.

ఈ రోడ్డులో రేయింబవళ్లు రెండు మండలాల పరిధిలోని సుమారు యాభై గ్రామాలకు చెందిన వాహనాలు, గ్రానైట్ లారీలు, ప్రజలు రాకపోక సాగిస్తుంటారు. ముఖ్యంగా ఈ రహదారిలో బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలు తదితరాలపై పెద్ద సంఖ్యలో ప్రయాణాలు చేస్తుంటారు. ఈ రంధ్రాల్లో పొరపాటును ఆటో చక్రం దిగబడిందో అందులో ఉన్న వారు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. రావికమతం మండలం కవ్వగుంట, బుడ్డిబంద, కొట్నాబిల్లి, బుచ్చియ్యపేట మండలం భట్లోవ, మాడుగుల మండలం ఔరువాడ తదితర ప్రాంతాలకు చెందిన గ్రానైట్ క్వారీల నుంచి పరిమితికి మించి భారీ రాళ్లతో ట్రాలీలు వస్తున్న కారణంగా ఈ రోడ్డు పలు చోట్ల ధ్వంసం కావడంతో పాటు మదుంలకు కూడా రెండు మూడుచోట్ల రంధ్రాలు ఏర్పడ్డాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అలాగే ఇక్కడికి సమీపంలో మరో వంతెన కూడా ఇదే పరిస్థితిలో ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి పరిమితికి మించి బరువుతో రాకపోకలు సాగించే వాహనాలకు అడ్డుకట్ట వేడంతో పాటు రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం, జనవరి 31 : పట్టణంలోని ఇందిరా కాలనీలో బుధవారం అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ భూమిపూజ నిర్వహించారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ బండి నూకాలమ్మ, ఎంపీటీసీ అరుణ, బండి శ్రీనివాసరావు, వార్డు సభ్యులు అప్పారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్నం నాగరాజు, కండెల్లి నరసింగరావు, మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యేలు



జి.కోడూరులో ఆర్‌బీకే భవనం ప్రారంభిస్తున్న గణేశ్

మాకవరపాలెం, జనవరి 31 : మండలంలోని జి.కోడూరు, పైడిపాల, పాపయ్యపాలెంలలో రైతు భరోసా, హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ, జడ్పీటీసీ పెట్ల సత్యవేణి, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షుడు రుత్తల వాసు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : మండలంలోని పెదమదీనా, పెదపూడి, ఆర్.శివరామపురంలలో విప్ ధర్మశ్రీ బుధవారం సచివాలయం, ఆరోగ్య ఉప కేంద్రం, రైతు భరోసా కేంద్ర భవనాలను ప్రారంభించారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరి దేవి, జడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ గొంపా వెంకటేశ్వరరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షుడు జోగా కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు 11 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

నర్సీపట్నం అర్బన్, జనవరి 31 : ఇక్కడి ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న పదకొండు మంది విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. వీరంతా గత ఏడాది డిసెంబరులో జరిగిన ఎన్ఎంఎన్ ప్రతిభా పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. వీరికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12000 చొప్పున ఉపకార వేతనం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

జూనియర్ కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్ డే





వేడుకల్లో డ్యాన్స్‌లు చేస్తున్న విద్యార్థినులు

కృష్ణాదేవిపేట, జనవరి 31 : ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ డేను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు డ్యాన్స్‌లతో అలరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అంకంరెడ్డి శ్రీనివాస్, గోవింద, నాగేశ్వరి, చిన్ని, దరిశి రామకృష్ణ, సత్యనారాయణలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డీఎస్‌సీ నోటిఫికేషన్ బూటకం

▸ ఉత్తరాంధ్ర నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు గణేష్

చోడవరం, జనవరి 31 : వైసీపీ ప్రభుత్వం 6,100 టీచర్ పోస్టుల కోసం ప్రకటిస్తున్న డీఎస్‌సీ నోటిఫికేషన్ కేవలం ఎన్నికల స్టంటేనని, ఇది నిరుద్యోగులను వంచించడమేనని ఉత్తరాంధ్ర నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు పుల్లేటి గణేశ్ విమర్శించారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ మెగా డీఎస్‌సీలో 23 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ ఐదేళ్లుగా ఊరిస్తూ వచ్చిన జగన్ ప్రభుత్వం, చివరికి ఆరు వేల వంద ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలపడం శోచనీయమన్నారు. ప్రభుత్వానికి నిరుద్యోగులపై నిజంగా అభిమానం, చిత్తశుద్ధి ఉంటే 15వేల ఉద్యోగాలతోనైనా మెగా డీఎస్సీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు.

ఆసరా నమూనా చెక్కుకు అందజేత

నర్సీపట్నం, జనవరి 31 : నియోజవర్గంలోని నాలుగు మండలాల్లో 57వేల మంది డ్వాక్రా సంఘాల మహిళలకు నాలుగు విడతల్లో వైఎస్ఆర్ ఆసరా పథకం కింద రూ.160 కోట్ల రుణ మాఫీ జరిగిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ తెలిపారు. బుధవారం ఇక్కడి ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వైఎస్ఆర్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ ఎం.సరోజిని, మునిసిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన నాయుడు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ పాల్గొన్నారు.

నేడు చీడికాడలో అభయాంజనేయ తీర్థం

చీడికాడ, జనవరి 31 : మండల కేంద్రం చీడికాడలో గురువారం అభయాంజనేయ తీర్థం నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు జరగనున్నాయన్నారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

దేవరాపల్లి, జనవరి 31 : విద్యుత్ లైన్ల పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు దేవరాపల్లిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈఈ కర్రి శంకరరావు తెలిపారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులంతా సహకరించాల్సిందిగా కోరారు.

ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి ఢీకొన్న మరో ఆటో

▸ ముగ్గురు ప్రయాణికులకు గాయాలు

గొలుగొండ, జనవరి 31: మండలంలో కొత్తజోగంపేట వద్ద ఆగివున్న ఆటోను మరో ఆటో ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. ఎస్ఐ కృష్ణారావు అందించిన వివరాల మేరకు.. కృష్ణాదేవిపేట నుంచి నర్సీపట్నం వెళుతున్న ఒక ఆటో డ్రైవర్ కొత్తజోగంపేట వద్ద వాహనాన్ని ఆపి ప్రయాణికులను ఎక్కిస్తున్నాడు. ఇదే సమయంలో వెనుక నుంచి వస్తున్న మరో బలంగా ఢీకొన్నది. దీంతో ముగ్గురు ప్రయాణికులకు గాయలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రావికమతం ఎంపీడీవోగా భానోజీరావు



భానోజీరావు

రావికమతం, జనవరి 31 : ఇక్కడి ఎంపీడీవోగా హెచ్.భానోజీరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కోటవురట్ల మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా పనిచేశారు. ఇంతవరకు ఈ స్థానంలో వెంకన్నబాబును ఉన్నతాధికారులు శ్రీకాకుళం బదిలీ చేశారు. కొత్త ఎంపీడీవోకు సిబ్బందితో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు.

బదిలీపై వెళుతున్న ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవో జయమాధవిని సన్మానిస్తున్న సిబ్బంది

నర్సీపట్నం అర్బన్, జనవరి 31 : ఇక్కడి ఎంపీడీవోగా పనిచేస్తున్న ఎస్.జయమాధవికి తూర్పు గోదావరి జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా బుధవారం ఆమె రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు కార్యాలయ సిబ్బంది, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఇదిలావుంటే, కార్యాలయం పరిపాలనాధికారి హెచ్‌వీ రమణబాబుకు ఈ బాధ్యతలు అప్పగించారు.

4న కొండల అగ్రహారంలో ముగ్గుల పోటీలు

మాకవరపాలెం,జనవరి 31 : కొండల అగ్రహారంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం సందర్భంగా ఈ నెల నాలుగో తేదీన మండలస్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో రామాలయం వద్ద నిర్వహించనున్న ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నామన్నారు పూర్తి వివరాలకు తమను సంప్రదించాల్సిందిగా సూచించారు.

దిబ్బిడిలో ఈవీఎంలపై అవగాహన సదస్సు



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


బుచ్చెయ్యపేట, జనవరి 31 : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలని దిబ్బిడి గ్రామ సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం అన్నారు. బుధవారం గ్రామ సచివాలయంలో ఈవీఎంలపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. అనంతరం వీఆర్వో ఎర్రయ్య తదితర రెవెన్యూ సిబ్బంది ఈవీఎం వినియోగాన్ని వివరించారు.

గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యత



చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ, జనవరి 31 : చెత్తబుట్టల వినియోగంపై గ్రామీణుల్లో చైతన్యం తీసుకువచ్చి తద్వారా గ్రామాల పరిశుభ్రతకు అంతా కృషిచేయాలని ఎంపీపీ కురచా జయమ్మ సూచించారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయం వద్ద సుమారు 19వేల చెత్తబుట్టలను 23 పంచాయతీల కార్యదర్శులకు బుధవారం అందజేసిన సందర్భంగా మాట్లాడారు. ప్రతి ఇంటింటికీ రెండు చెత్తబుట్టలు చొప్పున అందించి తడి, పొడి చెత్త ఇందులో వేర్వేరుగా వేసేలా గృహిణులకు వివరించాలన్నారు. ఎంపీడీవో జయప్రకాశరావు, జడ్పీటీసీ లాలం శారదావరలక్ష్మి, ఈవోపీఆర్డీ ఎం.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఏడు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు

▸ 'గురుకులాల సెక్యూరిటీ, పారిశుధ్య కార్మికులు ఆవేదన
▸ జిల్లా కో-ఆర్డినేటర్ రూపావతికి వినతి సమర్పణ



రూపావతికి వినతిని అందిస్తున్న సెక్యూరిటీ గార్డులు

దేవరాపల్లి, జనవరి 31 : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న తమకు ఏడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని సెక్యూరిటీ గార్డులు, పారిశుధ్య సిబ్బంది వాపోయారు. ఈ మేరకు విశాఖ జిల్లా సమన్వయకర్త ఎస్.రూపావతికి బుధవారం వారంతా వినతి పత్రం అందజేశారు. మొత్తం పదకొండు పాఠశాలలకు చెందిన ఈ సిబ్బంది పిచ్చేసి వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటివి కల్పించాలని కోరారు. దీనిపై ఆమె మాట్లాడుతూ వారంలో వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్టు సెక్యూరిటీ గార్డుల సంఘం నాయకుడు వరదపురెడ్డి తాతంనాయుడు తెలిపారు. ఆలిండియా పేరెంట్స్ అసోషియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పిల్లా చంద్రం, యమున, రాజేశ్వరీ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట కార్యదర్శిపై డీపీవోకు ఫిర్యాదు

రోలుగుంట, జనవరి 31 : మండల కేంద్రమైన రోలుగుంట గ్రామ కార్యదర్శి కిరణ్ విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం డీపీవో శిరీషారాణికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కార్యదర్శి కిరణ్ తరుచూ విధులకు డుమ్మా కొడుతున్నారన్నారు. ఫలితంగా వివిధ పనులపై కార్యాలయానికి విచ్చేసిన ప్రజలకు అవస్థలు తప్పడం లేదని వాపోయారు. ఇదిలావుంటే, గ్రామ సచివాలయంలో అరకొరగా సిబ్బంది ఉన్నందున పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. ఉన్నతాధికారులు వీటిపై తక్షణమే దృష్టి సారించాల్సిందిగా కోరారు.

శరభవరంలో ఉచిత వైద్య శిబిరం

రోలుగుంట, జనవరి 31 : శరభవరంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం ఓమ్ని ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్యులు ప్రమోద్ కుమార్, శ్రీనివాస్ తదితరులు రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి ఆధారాలు ఉంటేనే ఓట్ల తొలగింపు

▸ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 31 : పూర్తి ఆధారాలతోనే ఓట్ల తొలగింపు జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం రాత్రి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఓట్ల తొలగింపు, నమోదు చేసేందుకు తగిన ఆధారాలు ఉండాలన్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు 99 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు చేర్పులు, అభ్యంతరాలు 23,531 దరఖాస్తులు రాగా వాటిలో 13,415 ఆమోదించి 1230 దరఖాస్తులు తిరస్కరించినట్టు వివరించారు. ప్రస్తుతం ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.